కథ

# నిధి చాల సుఖమా...!?

కొండవలస శ్రీనివాసరావు

**నా**కు తెలుసు గరికన్న ఉత్తసత్తెకాలపు మనిషి. కాకపోతే మరీ అంత అమాయకంగా ఉంటాడంటే ఎవరూ నమ్మరు. గరికన్నలాంటి వ్యక్తులు లోకంలో ఏ కోటికో... నూటికోగాని అగపడరు. అటువంటి గరి కన్నను ఈ దినం కలువబోతున్నందుకు నా మన సెంతో ఉరకలు వేసింది.

గరికన్న ఉంటున్నది తొలుసూరు పల్లెలో. అది టెక్కలికి కిలోమీటరు దూరంలో ఉంది. మా చిన్నప్పుడు మేం ఆ ఊర్లోనే ఉండేవాళ్ళం ఉద్యోగరీత్యా నాన్నగారితో ఎక్క డెక్కడకు తిరిగి చివర్లో ఈ టెక్కలిలోనే మాష్టరుగా ఈ మధ్యనే బదిలీపై వచ్చాను. టెక్కలి వచ్చింది లగాయత్తూ గరికన్నను చూడాలని ఉవ్విళ్ళూరుతున్న నాకు పెండ్లి పిలుపు నా కోరిక తీర్చినట్లయింది. తొలుసూరు పల్లెలోని బెండికిష్టమ్మ కొడుకు పెళ్ళికని పెండ్లి కార్డు నిన్ననే ఇచ్చి వెళ్ళారు.

ఎలా అయితేనేం గరికన్న ఇల్లు కనుక్కొని వెళ్ళేసరికి గరికన్న మంచంపై పడుకొని''వినురా సదానంద యోగీ... నీవు వినవే రుతువన్నా వింతు బైరాగి...'' తత్వం పాడుతున్నాడు. నా మనసెంతో హాయనిపించింది.

''బావున్నావా గరికన్నా...?'' అడిగిన నాకు ఎవరూ బాబూ నీవు అంటూ వయోభారంతో చేతిని గొడుగు పట్టుపట్టి నావైపు పట్టి పట్టి చూశాడు గరికన్న.

''నేను గరికన్నా మీ ఇంటి ఎదురుగా ఉండే వాళ్ళం... సత్యనారాయణగారి అబ్బాయిని శీనూని...'' చెప్పాను.

''నువ్వా శీను... ఎన్నాళ్ళకెన్నాళ్ళకు నిన్ను చూశాను బాబూ... రా కూర్చో'' అని తను లేచి తన మంచంప కూర్చోబెట్టాడు.

''బావున్నావా గిరకన్నా...'' అడిగాను.

''మీ పెద్దల దయవల్ల అంతా నెమ్మదే బాబూ... తమరిప్పుడెక్కడ...? ఉంటున్నారూ...? పిల్లలెందరు...?అడిగాడు గరికన్న. నేను టెక్కలిలోనే స్కూలు మాష్టా రుగా పనిచేస్తున్నాను. నాకు ఒక అబ్బాయి, అమ్మాయి. నిన్ను చూస్తుంటే చాలా ఆనందంగా వుంది గరికన్నా.

''ఏదో బాబూ మీకు నామీద ఉన్న దయ అలాంటిది. అమ్మా,నాన్న బావున్నారా...?''అడిగాడు గరికన్న.

''అమ్మ, నాన్న చనిపోయి పదేళ్ళు అయింది గరికన్న. రెండు సంవత్సరాలలోపే ఒకరి తరువాత ఒకరు చని పోయారు...'' చెప్పాను.

''అయ్యో... పాపం... ఎంతమాట... ఏమైనా అమ్మా నాన్నలు చాలా పుణ్యాత్ములు. వారిని చూస్తేనే సకల పాపాలు హరించుకుపోతాయి...'' అమ్మానాన్నలను తలచుకొని దాదాప్యం చెందాడు గరికన్న.

''అంతా నీ అభిమానం గరికన్నా... అయినా నీవంటి మంచివాళ్ళు ఈరోజుల్లో ఉంటారనుకోను. నీ మంచి తనం వలనే నీ పిల్లలు వృద్ధిలోకి వచ్చారు. ఊర్కినే అన్నారా తల్లిదండ్రులబట్టే పిల్లలు ఉంటారని... నీ పిల్లలు కూడా మంచి నడవడిక గలిగిన వారే... వారివలన నీ జీవితం ఆనందంగా గడిచిపోతుంది కదా... ఈ వార్ధక్యంలో ఇంతకంటే ఇంకేం కావాలి చెప్పు...?''

''అదాంతా మీ చలవే బాబూ... ఆరోజుల్లో నేను, నా పిల్లలు చదువు సందెలు లేక ఉంట్టి మూర్ఖుల్లా ఉండే వారం... మీ సహవాసం వల్ల నాన్నగారి ప్రోద్భలం వలన పిల్లలకు సదువు సందెలు చెప్పించాను. వాళ్ళు ఉద్యోగస్తులైనారు. గుడిసె స్థానంలో ఈ ఇల్లు కట్టించాను. నీవన్నట్టు ఏ చీకు చింతా లేకుండా దేవుని ప్రార్థిస్తూ కాలం గడుపుతున్నాను...?''

''ఇంకేం...? అయినా మంచివాళ్ళని మమ్మల్ని పొగుడుతున్నావ్... నీవేం చెడ్డవాడివా... నీవన్నట్టు మంచి వాళ్ళతో మంచివాళ్ళే సహవాసం చేస్తే మంచి వాళ్ళవుతారు. ఎంత మంచివాళ్ళయినా వారితో చెడ్డ

వారు చేరితే మంచివాళ్ళు కూడా చెడ్డవాళ్ళయ్యే అవకాశం ఉంది. నీవూ, నీ కుటుంబం అసలు నీ జీవితమే విచిత్ర మైనది...''

''అంతా మీ అభిమానం... ఏమే బాసీ... ఎవరొచ్చారో చూడు... ఆ చేతులతోనే కాసిన్ని మజ్జిగనీళ్ళు బట్రా...'' ఇంట్లోని భార్య బాసెమ్మను పిలిచాడు గరికన్న.

''ఏం శీనుబాబూ... బావున్నావా...? శాన్నాళ్ళకి కని పించావ్'' అంటూ లోటాతో మజ్జిగ అందించింది బాసెమ్మ.

ఎండలో పడివచ్చాను కదా... మజ్జిగ తాగిన నాకు ఎంతో హాయి అనిపించింది. ''బాగానే ఉన్నాం బాసెమ్మ ఇక్కడ బెండికిష్టమ్మ కొడుకు పెళ్ళికని వచ్చాను. అలా మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను...''

''అలాగా... మామీద మీ దయ ఉంది... అంతేశాన బావూ. మీరు మాట్లాడుతుండండి... పొయ్యిమీద కూడు ఉడుకుతుంది దింపి వస్తాను...''

''లేదు. నేను ఇక వెళతాను... ఇంటికి వేగం వెళ్ళాలి. విధిలేక వచ్చాను. అయినా మిమ్మల్ని చూశాను, నా మనసుకు తృప్తిగా వుంది...'' చెప్పాను.

''అంత భాగ్యమా బావూ...ఒక్క సిటం ఉండండి...'' అంటూ లోనికి వెళ్ళి సంచినిండా వేరుశెనక్కాయలు తెచ్చి ''ఇవి పిల్లలు తింటారు తీసుకెళ్ళు బావూ'' అని బాసెమ్మ సంచెడే వేరుశనగకాయలు ఇచ్చింది.

ఇంతలో ''తాతయ్యా... చూడు అన్నయ్య ఎలా కొడుతున్నాడో...'' అంటూ ఇద్దరూ పిల్లలు వచ్చారు.

''వీళ్ళు మా పెద్దాడు కృష్ణమూర్తి పిల్లలు బావూ... మగపిల్లాడికి మీ గుర్తుగా నీపేరే శీను అని, ఆడపిల్లకి మీ చెల్లమ్మా పేరు ఉమాపార్వతి అని పెట్టుకున్నాం బావూ...'' ఆనందంగా చెప్పాడు గరికన్న. బొద్దుగా ముద్దొచ్చే పిల్లలకు మా పేర్లే పెట్టుకొని పిల్చుచకుంటున్నా రంటే నా ఆనందానికి అంతేదీ.

అప్పుడు మేం చిన్నప్పుడు గరికన్న ఇంటికెదురుగా ఉండే ఇంట్లో వుండేవాళ్ళం. నాన్నగారు రెవెన్యూ ఇన్స్పె క్టరుగా పనిచేసేవారు. టెక్కలిలో ఇల్లు దొరకక దగ్గర్లోనే ఉండే ఈ తొలుసూరు పల్లెలో ఇల్లు తీసుకొని ఉండే వాళ్ళం. కిలోమీటరు దూరంలో ఉండే తాలూకాఫీసుకు నాన్నగారు, బడిలో చదువుకోవడానికి మేం పిల్లలం వెళ్ళే వాళ్ళం. అప్పట్లోనే మాతోనే గరికన్న తన పిల్లలను మాతో బడికి పంపించేవాడు.

అదిన్నూ నాన్నగారు ''గరికన్నా...నీ పిల్లలను మా పిల్లతో బడికి పంపించు... చదువుకుంటే వృద్ధిలోకి వస్తారు. వాళ్ళని చదువులేక నీలా ఉప్పు అమ్ముకొని కూలి నాలి చేసుకొని బతగ్గలరా...'' అని గరికన్నకు నచ్చజెప్పి గరికన్న పిల్లలు మాతోపాటు చదువుకునేటట్లు చేశారు నాన్నగారు.

ఆ విశ్వాసంతోనే గరికన్న దంపతులకు మామీద ఎనలేని గురి అభిమానం. ''సరే అని చెప్పి ఇక నేను వస్తానని గరికన్న దంపతులతో చెప్పి'' అక్కడి నుండి బయలుదేరాను.

## మధురాతి మధురం

అలమేలు మంగాంబ అనురాగ సుధ పంచు
అన్నమాచార్యుని ఆర్జితంబు
శ్రీకాళహస్తీశు చిరకీర్తి కొండాడూ
ధూర్జటి కవివరు నూర్జితంబు
ఆంధ్రమహావిష్ణు నౌన్నత్యమును దెల్పు
పురుషోత్తమార్యుని పుణ్యఫలము
దశరథరాముని దాక్షిణ్యమును జూటు
కంచెర్ల గోపని సంచితంబు
భక్తిపరిపూర్ణ భావసంభాసితంబు
ముక్తికాంతామణీ శిరోమౌక్తికంబు
రీతి వర్ధిల్లి విశ్వవిఖ్యాతి గొనుచు
వెలుగు లీనిన భాష నా తెలుగు భాష!
ఆంధ్రభూములలోన అవతరించినయట్టి
భారతగ్రంథమై పరగుభాస
తెలగాణి మాగాణి ఫలముగా వినుతించు
భాగవతమ్మున వరలు భాష
రాయలసీమలో రతనాల పంటయౌ
రామాయణమున చెలంగుభాష
పలుమాండలికముల ప్రశ్లేషణమ్ముతో
మహితమై చెన్నొందు మధురభాష
గుండెలోతుల కదలాడి కూర్మి పెంచి
ఐకమత్యమే బలమని అవని జాట
ప్రాంతబేధాలు మరచిన ప్రజల భాష
వెలుగు జిలుగులు విరజిమ్ము తెలుగుభాష

హెచ్.వి.ఎల్.ప్రసాదుబాబు

''వీలైనప్పుడంతా వస్తూండు బావూ...'' అంది బాసెమ్మ.

అలా బయలుదేరి నడుస్తున్న నాకు ఆరోజుల్లోని జ్ఞాపకాలు తెరలు తెరలుగా సాక్షాత్కరించింది.

అసలు గరికన్న ఎంత అమాయకుడో వారి పిల్లలు అంతటి చురుకైనవారు. కానీ చదువులో వెనకపడే ఉండేవారు. నాతోపాటే చదువుకున్న గరికన్న పెద్దకొడుకు కృష్ణమూర్తి అత్తెసరు మార్కులతో ఎస్.ఎస్.ఎల్.సి పాసైనాడు. నేను ఫస్టుక్లాసులో పాసైనాను.

చదువులో పెద్దగా తెలివిలేకున్నా జనరల్‌గా కొత్త విషయాలు తెలుసు కోవాలనే తపన ఉండేది కృష్ణమూర్తిలో. అందుకే వాడు ఈనాడు బ్యాంక్ మేనేజరుగా పనిచేస్తున్నాడు.

ఎంత మెరిటు ఉన్నా నేను ఆ రోజుల్లో బతకలేక బడిపంతులు ఉద్యోగం చేయడమే గగనమైపోయింది. ఎంత తెలివి తేటలున్నా అదృష్టం లేనిది ఏం చేయలేమని కృష్ణమూర్తికి నాకు జరిగిన తేడాల్లో తెలిసింది. అందుకే నేను అదృష్టముండాలి అంటాను.

ఓసారి అమ్మ కృష్ణమూర్తిని పిలిచి ''బాబూ ఈ దినం త్రినాథమేళా చేస్తున్నాము. నాయుడుగారి దొడ్లోని పూలు తెచ్చిపెట్టు...'' అని చెప్పింది.

దానికి కృష్ణమూర్తి పూలకు బదులు పూదు, దుక్కిదున్నే కాడి కట్ట పూజదగ్గరకు తెచ్చి ఇచ్చిన కృష్ణమూర్తి తెలివితేటలకు ఘొల్లున నవ్వాం. అటువంటి కృష్ణమూర్తి ఈనాడు బ్యాంక్ మేనేజరుగా ఉద్యోగం చేస్తున్నాడంటే అందుక్కారణం అతని తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యాం, అతని అదృష్టం అంటాను.

అసలు గరికన్నను ఉప్పు గరికన్న అని పిలిచేవారు. తెల్లవారి లేచి కావడిలో ఉప్పు వేసుకుని పరిసర ప్రాంతాలలో రోజంతా ఉప్పు అమ్ముకొని జీవించే వాడు గరికన్న.

''ఉప్పమ్మా... ఉప్పు... తెల్లటి మల్లెపూవులాంటి ఉప్పు... పాలసముద్రం నుండి తయారైన ఉప్పు... అడ్డ అణా, బేడకు ముడట్లు... నవరు చులమీ తల్లి ఈ ఉప్పు... ఉప్పు లేనిదే అసలు మానవుడికి ఆహారమే లేదు...'' ఇలా ఇంటింటికీ తిప్పి ఉప్పు అమ్మేవాడు.

అలా ఉప్పు అమ్ముకొనే గరికన్నకు ఉప్పు ఇంటి పేరుగా మారి ఉప్పు గరికన్నగా చలామణి అయ్యాడు. రోజంతా ఇలా కష్టపడి ఉప్పు అమ్మగా వచ్చిన డబ్బులు షావుకారుకు అప్పగించి అతనిచ్చిన కమీషన్ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు.

జీవితంలో జరిగే ఒకో సంఘటన అతని జీవితాన్నే మార్చేస్తుంది. జీవితంలో జరిగిన ఈ సంఘటన అతన్ని సంఘంలో ఎంతటి ఉన్నతునిగా నిలిపిందో గరికన్న జీవితమే నిదర్శనం.

ఆ దినం ఎప్పటిలానే గరికన్న ఉప్పు కావడిని భుజంపై వేసుకొని చుట్టుపక్క గ్రామాల్లో ఉప్పు అమ్మేందుకు వెళ్ళాడు. సాయంత్రం గోధూళివేళ తిరిగి ఇంటికి వస్తూ తోవలో బమ్మిడివారి కోనేరులో స్నానం చేయడానికి కావడిని గట్టుపై పెట్టి కోనేటిలో దిగబోయాడు. అంత

## కనకస్వరాలు

ము.స.1. ధ్వంస రచనకు అణువులున్నాయ్
మహమ్మార్లకు మందులున్నాయ్
పేదతనమును చంపడానికి
మందు కనుగొనరా!

2. గాలి, నీరూ వేరు వేరుగ
మతములను సృష్టించుకుంటే
భూమిపైనా మిగలడానికి
మనుజులుండేనా?

3. మీకు మీకూ పడకపోతే
ఒకడి దొకడికి నచ్చకుంటే
గడ్డిబొమ్మల కాల్చి, పశువుల
నోరుకొట్టాలా?

4. నగలనిచ్చీ, నగదునిచ్చీ
దేవతలనూ ఖైదుచేసీ
కోరినట్టీ కోరికలనూ
తీర్చుకొంటారా?

5. గుడికి కోట్లను కుమ్మరింతురు
శిలకు నగలను చేసిపెడుతురు
బడికి యిస్తే బ్రతుకులెన్నో
బాగుపడిపోవా?

6. పోతరాజులు, శ్రీనివాసులు
పేద సాదాతారతమ్యాం
దేవతలకే తప్పనప్పుడు
మానవుడి దేమున్నదోయ్?

అయినాల కనకరత్నాచారి

## వృషభ విలాపము

ఎండవానకక బతుకు బండి లాగుచుంటి
దుర్భర జీవితాన దశాబ్దము దొర్లిపోయె
కాడిరాపిడికి మెడపైన కాయకాచె
మందుమాకులేక అటుపైన గాయమాయె
అకటా! ఈ శకటము నా సంకటము పెంపుచేసె
యజమాని యిసుమంతయు కనికరము చూపడాయె
ఎద్దు పుండు కాకికి ముద్దను నానుడి నిక్కమాయె
ఎచట నుండి యె వాయసమొకటి వచ్చి పైన వాలె
దాని నదలింప నాయత్నము విఫలమాయె
ముక్కుతో పొడుచుచుండె వుండును మక్కువతోడ
కడుపునిండెనేమో, ఏమో వాయసమెగిరిపోయె
ఏనాటిపాప ఫలమో నేనెరుగనైతి
యిడుములు చెందమనుచు విధి నానుదుట వ్రాసె
మూగజీవిని పరులతో చెప్పుకొన వీలుకాదే
మృత్యువు దరిచేరక అపహాస్యము చేయసాగె
బాధ ఆవహించి నడక మందగించె
యజమాని చిత్రహింసలు పరాకాష్ఠ చేరె
అదను చూచి నన్ను కసాయికి అమ్మె నాతడు
కసాయి వాని కత్తి నా మెడపై వేటువేసె
సగము చచ్చితి పాణముపోయి, పోక
కొన ఊపిరి సొంతము పోకమునుపె
నా చర్మము ఒలిచె రయోజనము మదినెంచి నాతడు
ఖండ ఖండములుగ నా ఒడలు నరికి పోగుచేసె
నా అంతిమ శ్వాశ అనంతవాయువుల కలిసిపోయె
కడకు నా జీవితము కడతేరె నిటుల
పగవానికైనను వద్దు ఎద్దు జన్మ.

ఎ.శ్రీహరిప్రసాద్

లోనే గట్టుపైగల రావిచెట్ట మొదట్లో ఓ గుడ్డ సంచి నిండుగా కనిపించింది. ఆ సంచిగల వారెవ్వరా అని చుట్టుపక్కల కనుచూపుమేర చూశాడు. ఒక్క వ్యక్తి కనబడలేదు. బహిర్భూమికి వెళ్ళాడేమోనని కొంతసేపు నిరీక్షించాడు గరికన్న.

కొన్ని సెకండ్లు, మరికొన్ని నిముషాలు గడిచాయి. ఎవ్వరూ సంచి దరిదాపులకు రాలేదు. సంచి దగ్గరగా వెళ్ళి సంచిని విడదీసి చూసి నిశ్చేష్టుడయ్యాడు గరికన్న. సంచిలో మెట్లు కట్టలు... అంతా పెద్దనోట్లే... వందా, వేయి నోట్ల కట్టలు.

తన జీవితంలో గరికన్న ఒక్క పెద్ద నోటు చూసి ఎరుగడు. ఒక్కసారి పెద్దనోట్లన్నీ కట్టలు కట్టి తన కళ్ళెదుట ఉండడం 'కలలో కనిపించేది కళ్ళ ఎదుట నాట్యం చేస్తున్నట్టు' భ్రాంతి చెందాడు.

శరీరమంతా చెమట్లు పట్టి తల బరువెక్కిపోయింది. అంతలోనే భయమేసింది. అక్కడి నుండి పారిపోవాలనిపించింది. అయినా ఏదో శక్తి అక్కడినుండి తనను కదలనివ్వలేదు. అలా ఎంతసేపో నోట్లకట్టలను చూస్తూ ఉండిపోయాడు. కొన్ని క్షణాలు గడిచింది. గరికన్న కాస్త తెలివి చేసుకొని సంచిని తెఱచి నోట్ల కట్టలను తనివి తీరా చూశాడు. అబద్ధంకాదు... సంచి నిండుగా నోట్ల కట్టలు.

తనిప్పుడేం చేయాలి? ఎవరిదా డబ్బని ఎవరికి ఇవ్వాలి? పరి పరి విధాల ఆలోచనలకు గురయ్యాడు గరికన్న. తుదకొక నిర్ణయానికి వచ్చినట్లు సంచిని జాగ్రత్తగా చేతితో తీసిపట్టుకొని తన కావడి ఉప్పుగంపలో పెట్టాడు. పైన జంగిడిమూత పెట్టి తొందరగా కోనేరులో దిగి స్నానం అయిందనిపించాడు.

'భగవంతుడా నాబోటి ఈ పేదవానికి ఎందుకయ్యా ఈ నిధిని చూపించావ్? దీన్ని నేనేం చేయాలి...? ఈ డబ్బు నేను అనుబవించతగుదునా? ఏమిటి స్వామీ ఈ పరీక్ష...' దేవుని మనసారా మొక్కాడు.

డబ్బుతో ఉన్న కావడిని తీసి తిరిగి భుజంపై పెట్టాడు. కావడి నిండా ఉప్పుతో ఉన్న కావడికంటే ఇంకా బరువనిపించింది. ఎలా అయితేనేం ఇంటికి చేరాడు గరికన్న. ఇద్దరు పిల్లలు కిరసనాయిలు బుడ్డీ దగ్గర చదువుకుంటున్నారు. రెండవ తరగతి చదువుతున్న చిన్న కొడుకు దానేసు.

''పరుల సొమ్ము పామువంటిది...
ఆశ అంతానికి దారి...
తృప్తికి మించిన సౌఖ్యములేదు...''

ఇలా నీతులు వల్లిస్తున్నాడు. కొడుకు నీతివాక్యాలు తనకే చెపుతున్నాడని గరికన్న గతుక్కుమన్నాడు. ఠక్కున ఓ క్షణం నిలబడిపోయాడు. నీతివాక్యాలు చదువుతున్న కొడుకును చూశాడు దానేసు తన మానాన తను పాఠం చదువుకుంటూ కనిపించాడు.

''అమ్మయ్య... నాకు చెప్ప లేదు కదా...'' అనుకుంటూ తటాలున ఇంట్లోకి దూరి పోయాడు. భార్య వంటింట్లో వంట చేస్తుంది. అసలు పిల్లలు, భార్య తనను గమనించనే లేదు. తొందరగా ఇంట్లోకి వెళ్ళి కావడి దించి అందులోని డబ్బు సంచి జాగ్రత్తగా పైకి తీసి ఉన్న ఒక్క చెక్కపెట్టెలో డబ్బు సంచిని జాగ్రత్తగా దాచాడు గరికన్న.

''ఎంతసేపయిందయ్యా నువ్ వచ్చి...?'' భర్త వచ్చాడని తలచి బాసెమ్మ అక్కడకు వచ్చి అడిగింది.

''ఇప్పుడే...'' తడబడుతూ చెప్పాడు గరికన్న.

''ఏంటలా నీర్సంగావున్నావ్...? ఇంట్లో బాగా లేదా...? ఏంటా ముఖం పీడకొట్టినట్టు...'' అడిగింది బాసెమ్మ.

''ఏంలేదు... బాగానే వున్నాను... పద... పద...'' అంటూ తడిబట్ట వదలి పొడిబట్ట కట్టాడు గరికన్న.

''ఏంటో ఎండనక వాననక రోజూ ఉప్పు అమ్మనిదే పూటగడవదు... అయినా ఈ దినం ఎండ ఎక్కువగానే ఉంది... ఎండ దెబ్బ బాగా తగిలింది కాబోలు'' అంటూ భర్త విడచిన తడిబట్ట ఆరవేయ వెళ్ళింది బాసెమ్మ.

''అమ్మా కూడెట్టు ఆకలవుతుంది...'' అడిగాడు చిన్న కొడుకు దానేసు.

''అలాగే లేరా... మీ అయ్యని, అన్నని పిలుచుకురా... అందరికీ ఒకసారే కూడు వడ్డించేస్తాను...'' అనేంతలోనే గరికన్న, కృష్ణమూర్తి వచ్చి భోజనానికి కూర్చున్నారు.

అందరికీ భోజనాలు వడ్డించింది బాసెమ్మ. వేడన్నంలో తరమాని పులుసు వేసుకొని పిండొడం నంజుకుంటూ ఆవురావురంటూ పిల్లలు భోంచేసి పక్కలపై చేరి పడుకున్నారు.

''ఏందయ్యా...? రోజూ ఆవురావురంటూ కూడు తినేవాడివి. ఊదకూడు సయించలేదా ఏమిటి... కొసింత వరికూడు మిగులుంది వేసిదేటి...'' అడిగింది బాసెమ్మ.

''వద్దు... వద్దు... ఇంకేం నేను ఇపుడు తినలేను గానీ, నువ్వు తొరగా పనులు తెమల్చుకొనిరా... నీతో మాటాడాలి...'' అంటూ అర్ధాంతరంగా కంచంనుండి లేచి చేయి కడుక్కొని పక్కమీదకు వెళిపోయాడు గరికన్న.

''అసలు ఇతగాడికేమయింది...?వచ్చిందగ్గర నుండి చూస్తున్నాను... రోజులా హుషారుగా లేడు... పిల్లలతో సరదాగా మాటడలేదు. వేగిరం రమ్మనమంటున్నాడు... ఏదో పెద్ద విషయమే జరిగిందని తలచింది బాసెమ్మ. తనకేమాత్రం తిండి తినబుద్దేయలేదు. చెంబుతో మంచి నీళ్ళు తీసుకొని కడుపునిండా తాగింది బాసెమ్మ. తొందరగా పనులన్నీ ముగించుకొని భర్త దగ్గరకు వెళ్ళింది

## అల్లరి ఉల్లాన్లు

అల్లరి ఉల్లి
చీర విప్పిందంటే
కళ్ళల్లో నీరే!
    కొంటి మిరప
    ముద్దు ఇచ్చిందంటే
    నోరు మంటే!
మండే ఎండల్లో
నా మెడకు గుదిబండ
నా స్వేచ్ఛకు ఎండే!
    ఆకాశం అబ్బాయి
    భూమి అమ్మాయి
    యుగాలుగా
    ప్రేమ చూపులు
    వారి కళ్ళుకాయలే
    కోటాను కోట్ల జనాలు!
పెండ్లి కూతురు
తలొంచుకు కూచుందేం?
పెండ్లి కొడుకు తల
ఎలా వంచాలా అని
తలపోస్తోంది!
    పెండ్లి కొడుక్కి, పెండ్లికూతురు
    అమ్మ నాన్న
    పూజలు చేస్తున్నారేం?
    తనకూ తమలాగే
    కూతురు పుట్టాలని
    కసిదీరా వాంఛిస్తున్నారు!
ప్రేమ కోసం బీచి
పెండ్లి కోసం తాళి
చావు కోసం సముద్రం

బద్ది నాగేశ్వరరావు

## అన్వేషణ

**నే**ను పరిగెడుతున్నాను
కోటి ఆశల నుండీ - కోటానుకోట్ల ఆంక్షల నుండీ
కడలి ఆలోచన - అలల ఆవేశంతో
నిజాల్లాంటి స్వప్నాల నుంచీ
'స్వప్న'మైతే బాగుండేదనిపించే నిజం నుంచీ
సంఘం అనే అడవి నుంచీ
సమాజం అని చెప్పుకునే మృగాల నుంచీ
నిద్రావస్థలో ఉన్న న్యాయం నుంచీ
నిద్రపోతున్న ధర్మం నుంచీ
నిద్రనటిస్తున్న చట్టం నుంచీ
ఆశల తీరంవైపు - రంగుల హరివిల్లు వైపు
ఇలా సాగుతున్న నా పయనానికి అర్థం-కాదు
పలాయనం
నవ సమాజానికి నాంది పలికినప్పుడు లభిస్తుంది
నా జన్మకు అర్థం - పరమార్థం

దోనెపాముల దీప్తి

బాసెమ్మ.

సంచిలో డబ్బు దగ్గరపెట్టుకొని రెండు చేతులతో తలపట్టుకొని బొంతుగా కూర్చున్న భర్తను చూసి ఆశ్చర్య పోయింది బాసెమ్మ.

''ఏందయ్యా నీవాలకం...ఆ సంచేమిటి...?'' అంటూ సంచి విడదీసి అందలి నోట్ల కట్టలను చూసి నిశ్చేష్టురాల యింది బాసెమ్మ.

''ఇదంతా డబ్బే... ఇంత డబ్బు ఎక్కడిదయ్యా...'' కొంత తెలివి చేసుకొని అడిగింది బాసెమ్మ. స్నానానికని బమ్మిడివారి చెరువుకు వెళ్ళిన దగ్గర నుండి ఇంటికివచ్చే వరకూ డబ్బు గురించి పూసగుచ్చినట్లు చెప్పాడు గరికన్న.

''ఏమిటోగాని ఈ డబ్బు తెచ్చింది లగాయత్తు మనసు పరిపరి విధాలపోతూంది... పాముని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నట్లుంది. ఈ డబ్బును వదిలేస్తే గానీ నాకు సుఖంలేనట్టుంది... ఏం చేయమంటావు బాసే...''

భార్యను అడిగాడు గరికన్న.

''మనకు దొరికిన ఈ నిధితో మనకెటువంటి సుఖం కనిపించలేదు. లేని భయం ఆందోళన... ఎందుకొచ్చిన ఈ నరకయాతన... నీ కాయకష్టంతో వచ్చే ఆ డబ్బుతోనే మన కుటుంబం కష్టంగా నెట్టుకొచ్చినా అందులోనే ఎటువంటి భయమూ, బాధా లేకుండా లేమిలో సుఖంగా బ్రతుకుతున్నాము. నీ ఈ పరిస్థితి చూస్తుంటే... కోడి గరివెడు ధాన్యరాశిపై ఉన్నప్పటికీ ఆ ధాన్యరాశిని తన కాళ్ళతో కెలికి వచ్చే గింజలనే తింటుందిగానీ దొరికింది కదా అని ధాన్యరాశిలోని గింజలను ఆబగా తినదట... అలాగుంది.

ఈ నిధి మనకు దొరికినా దానిలో హాయిగా బ్రతకలేక సుఖం లేకపోతోంది... ఎందుకొచ్చిన ఇబ్బందిగానీ ముందు ఆ డబ్బును తీసుకెళ్ళి మన ఎదురింటి సత్యం బాబుకు ఇచ్చి జరిగిందంతా చెప్పితే దానికేదో ఉపాయం చెబుతారు'' చెప్పింది బాసెమ్మ.

రాత్రి పదిగంటలయింది.గ్రామమంతా ఘాఢనిద్రతో నిశ్శబ్దంగా ఉంది. తలుపు తట్టిన చప్పుడుకు ఇంత రాత్రివేళ ఎవరా...? అని తలుపు తెఱచి ఎదురుగా న్న గరికన్న, బాసెమ్మలను చూచి మీరా... ఏంటి ఇలా వచ్చారు...?'' అని అడిగారు సత్యనారాయణగారు.

ముందు లోనికి పదండి బాపూ... అంటూ కంగా రుగా భార్యా భర్తలిద్దరూ సత్యనారాయణను దాటు కుంటూ ఇంటిలోనికి వెళ్ళారు. వారి కంగారును చూసి ఏదో జరుగరానిది జరిగిందని తలచి ''మీకొచ్చే భయ మేం లేదు... చెప్పండి ఏం జరిగిందో...'' అడిగారు.

అంతవరకు జరిగిన విషయం, డబ్బు దొరికిన వైనం చెప్పి బాబూ డబ్బుతో ఇంటికాడికి వచ్చిన దగ్గరనుండి, ఏదో భయం, నోటికి మెతుకెళ్ళదు... కంటికి కునుకు రాదు... మనసుకు నిలకడానదు... ఏదో చేయని నేరం చేసినట్లు భయం... అంతా ఈ డబ్బు వలనే బాబూ... అందుకే ఈ డబ్బును ఎలా వదిలిస్తారో మీదే భారం అంటూ డబ్బు సంచి సత్యనారాయణకు ఇచ్చాడు గరికన్న.

సంచి విప్పిచూసి విభ్రాంతి చెందారు సత్యనారాయణ గారు. అతని భార్య శేషమ్మ, శీను మొదలైన పిల్లలంతా అప్పటికే అక్కడకు వచ్చి చూశారు. వాళ్ళందరిని మీరెం దుకు ఇక్కడ పోయి పడుకోండని పిల్లలను పంపిం చేశారు.

లోకంలో డబ్బు దొరికితే ఎదుటివారికి తెలియ కుండా తమ ఇష్టం వచ్చినట్లు ఖర్చుసుకొని జల్సాగా బ్రతుకుతారని విన్నారు సత్యనారాయణ. కానీ దొరికిన నిధివలన సుఖం లేదంటూ ఇలా తృణప్రాయంగా వదులుకుంటున్న గరికన్న గుణానికి జోహార్లర్పించారు

సత్యానారాయణ గారు.

"సరే మీరు వెళ్ళండి ఉదయం ఎనిమిది గంటలకు పోలీస్ స్టేషన్‌కు ఈ డబ్బు అప్పజెప్పొద్దాం..." అని చెప్పి గరికన్న దంపతులను తమ ఇంటికి పంపేశారు సత్యానారాయణ గారు.

"ఇదేంటండీ ఇంత డబ్బు తెచ్చి మనింట్లో పెట్టేశారు... ఎవరైనా వెదుక్కుంటూ వచ్చి మనింట్లోని డబ్బు పట్టుకుంటే లేనిపోని గొడవలు వస్తాయేమో అని భయంగా ఉందండీ..." అంది శేషమ్మ.

"అవేం మాటలు శేషూ... ఇదేం దొంగతనం చేసి తెచ్చిన డబ్బా... దొరికింది... రేపు ఉదయం పోలీస్ స్టేషన్‌కు ఒప్పజెప్పేద్దాం అనుకుంటున్నాం కదా... ఇంతలోనే భయమైతే ఎలా... పోయి పడుకో..." అని చెప్పి డబ్బు సంచి తను పడుకున్న మంచం దిగువ లోపలిఇక దాచి పక్కపై పడుకున్నారు సత్యనారాయణగారు. అయినా అతనికి కంటిమీద కునుకురాలేదు.

మరుసటిరోజు ఉదయం సత్యానారాయణ, గరికన్నా పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి దొరికిన డబ్బు అప్పజెప్పి జరిగిందంతా చెప్పారు.

"అవును... ఈ డబ్బు కోసమే నిన్న సాయంత్రం కందుల బంగారయ్య అనే నౌపడా సాల్టు ల్యాండ్స్ ప్రొప్రయిటర్ వచ్చి తన డబ్బు రెండు లక్షలు పోగొట్టుకున్నానని రిపోర్టు ఇచ్చారు.

టెక్కలి బ్యాంక్‌లో డ్రా చేసిన ఆ డబ్బుతో వస్తూ బహిర్భూమికని బమ్మిడి కోనేరు గట్టు దగ్గరకు వెళ్ళి తిరిగి వెళ్ళేటప్పుడు కొంచెం కళ్ళు తిరిగినట్లయి డబ్బు సంచి మరచిపోయి వెళ్ళిపోయారట. అలా బస్సెక్కి నౌపడా ఇంటికి వెళ్ళేసరికి జ్ఞప్తికి వచ్చిన డబ్బు మఱచిపోయినందుకు ఎంతోబాధపడి తిరిగి పరుగెట్టుకొంటూ వచ్చి చూడగా డబ్బు ఉంచిన చోట కనబడలేదట. దాంతో నెత్తీనోరు బాదుకుంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి మాకు రిపోర్టు ఇచ్చారు.

ఇప్పటివరకు ఎవరూ డబ్బు తెచ్చి ఇది దొరికిందని ఇవ్వలేదు... ఎంక్వయిరీ చేస్తాం వెళ్ళండని పంపేశాము... ఇప్పుడే అతన్ని పిలిపిస్తానని చెప్పి ఫోన్ చేసి బంగారయ్యను రప్పించారు పోలీస్ సి.ఐ గారు.

బంగారయ్య పోయిన డబ్బును చూసుకొని ఎంతో సంతోషించారు.డబ్బు తెచ్చి ఇచ్చిన గరికన్న నిజాయితీకి ఎంతగానో సంతోషించారు. అందుకు బహుమతిగా పదివేల రూపాయలు సి.ఐ ద్వారా గరికన్నకు ఇచ్చారు కందుల బంగారయ్య. ముందు డబ్బు తీసుకోవడానికి ఇష్టపడకపోయినా, సి.ఐ గారు, సత్యనారాయణ గారు ఇది బహుమతిగా ఇస్తున్న డబ్బు, ఫరవాలేదు తీసుకో గరికన్నా అని నచ్చజెప్పగా గరికన్న బహుమతిగా ఇచ్చిన పదివేల రూపాయలు తీసుకున్నాడు.

అదండీ ఉప్పు గరికన్న కథ. గరికన్న వైనం వింటే త్యాగరాయ కృతి 'నిధి చాలసుఖమా...? ఈశ్వర సన్నిధి చాల సుఖమా...??' అనేది జ్ఞప్తి వస్తుంది నాకు. ■

## హెచ్చరిక

నన్ను ముద్దుపెట్టుకోకు
నిదానమే ప్రధానం
ముందు వాహనాన్ని ఢీ!
ఇద్దరు దుర్మరణం!!

## ఆయుధాలు

అణు బాంబు ఆయుధం
అక్షరమూ ఆయుధం
సద్వినియోగమైతే సంక్షేమం
దుర్వినియోగమైతే సంక్షోభం

## నాయకుడు

రోడ్డు ప్రక్క పొలాలు
సిటీలో స్థలాలు
చీకటి వ్యాపారాలు
నిశానిదారుడు
అందరికి నాయకుడు

## మండుతున్న ధరలు

ఆనందరావు ఆనందంగా
కనిపించేవాడెప్పుడు
దిగాలుగా కన్పిస్తున్నాడిప్పుడు
సంసారి అయ్యాడు!

పరుచూరి శ్రీనివాసరావు